# అసురసంధ్య

కళ్లు తిరిగినట్టయినవి. గుండె గభాలున కొట్టుకుంది, ఆ మాట వినేటప్పటికి - ఎంత హఠాత్తుగా, ఎంత కోపంగా అన్నా డామాట!

చావిట్లో కిటికీతలుపులు ఠపాలున మూసుకున్నాయి. బయట చిన్నగా గాలి సాగింది.

లక్ష్మీదేవిగారికి కొంచెం కోపంకూడ వచ్చింది. నిన్నమట్టుకు నిన్నా యిల్లాగే, తనేమంత తగనిమాట అన్నదిగనుకను? నిన్నటి విషయాలు తలపుకొచ్చాయి. "పొద్దున్న మన కుక్క- టైగరు గడ్డిమేటుఎక్కి- దక్షిణపువేపుగా తిరిగి అదేపనిగా ఏడ్చిందిరా. ఆవేపునించీ వరద వచ్చేట్టుగా వుంది. గోనలేరు పొంగుతుందేమో. మనది అసలే పాత ఇల్లు. భయంగా ఉందిరా" అన్నది లక్ష్మీదేవిగారు. వెంటనే "ఆ పిచ్చికబుర్లన్నీ నాదగ్గర తీసెయ్యమ్మా. టైగరుకి పాలుపోశావా లేదా? సాయంత్రం కావస్తోంది. షికారుకి తీసికెళ్ళాలి" అన్నాడు ప్రసాదరావు. "ధర్మరాజుకి మల్లే ఆ కుక్క-ఒకటి నీకు – వెంట – ఎప్పుడు చూచినా, ఎక్కడికెళ్ళినాసరే. సావకాశంగా మాట్లాడడానికి వీల్లేదు" అంది ఆవిడ మామూలుధోరణిలో. దానికతను "మనుష్యులకంటే ఈ కుక్కే- నన్ను బాగా అర్థంచేసుకుం దనుకుంటాను" అన్నాడు, నోరుజారి. వెంటనే బాధకలిగింది - మనస్సులో. ఆమాట ఎవరినన్నట్టూ? ఒకరిని ఉద్దేశించి అన్నమాట కాదది. అయినా అమ్మనే అన్నట్టుగా లేదూ? ఎంత తొందరపడ్డాను, అయ్యయ్యో-అనుకున్నాడు. తనమీద తనకి పట్టలేనంత కోపం వచ్చింది. కనుబొమలు చిట్లించాడు. చటాలున లేచి గుమ్మంలోనించి

వెళ్ళిపోయాడు. లక్ష్మీదేవిగారు నిర్ఘాంతపోయారు. అతని మనోబాధ లేమీ ఆ తల్లికి అర్థంకాలేదు.

గుమ్మందిగగానే ప్రసాదరావుకి మనస్సు నీరైంది. అమ్మని ఎంత బాధపెట్టానా అని పశ్చాత్తాప పడ్డాడు.

రాత్రిపడ్డతరువాత పైగరు ముందూ, అతను వెనకా ఇల్లుచేరారు. అల్లావెళ్ళింది ఎందుకో, తిరిగివచ్చింది ఎందుకో లక్ష్మీదేవిగారికి తెలియలేదు.

అది నిన్నసాయంత్రం వరుస.

ఈవేళకి ఈవేళ ఇల్లా. అయినా ఇంత విడ్డూరంగా ఇదివరకు ఎప్పుడు జరిగింది?

మొన్ననూ అంతే. ఆనాడూ అల్లాగే అనవసరంగా కోపంతెచ్చుకున్నాడు. "ఉద్యోగం వెతుక్కోటానికి వెళ్ళాలమ్మా. ఉద్యోగం దొరకగానే నిన్ను తీసుకెళతాను" అన్నాడు, ప్రసాదం. దానికి, ఉద్యోగానికి ఏం తొందరరా. నేను ఒంటరిగా ఎల్లావుండను? ఏదో ఒక ఇంటివాడ వయితే నీబాటకి నీవుఎక్కడ తిరిగివచ్చినా, నాకు ఇంట్లోతోడు వుంటుంది గదా" అన్నది లక్ష్మీదేవిగారు. "నీకేమి అర్థంకావటంలేదమ్మా" అన్నాడు విసుగ్గా. ఇందులో ఏముంది అసలు అర్థంకాకపోవటానికి. ఈమధ్య గ్రామానికి తిరిగివచ్చిన తరువాత విసుకు, కోపం ఎక్కువ ఆయినాయి వాడికి, ఏంచెప్మా?.... లక్ష్మీదేవిగారు ఆలోచిస్తూనే ఉన్నారు.

కాని ఈవేళ అల్లాగాదే! అంతటితో తెమలలేదు విషయం.అతని ముఖం అంత బాధగా కోపంగా ఎప్పుడూ లేదు. కనీసం అల్లా ఆవిడ ఎన్నడూ చూడలేదు. మనిషి ఒకమాదిరిగా అయిపోయాడు – పిచ్చి వాడిలా. ఆ కళ్ళు బిత్తరిచూపులు! ఆ చేతులు వణకడం! "ఇక తిరిగి రాను" అని అంత ఖచ్చితంగా ఇదివరకు ఎన్నడూ అనలేదే! ఎన్ని ఆశలు పెట్టుకుంది కొడుకుమీద – చదువుకుని వృద్ధిలోకివచ్చి, గొప్ప

ఉద్యోగి అవుతాడని! వృద్ధాప్యంలో తనకి తోడుగా, నీడగా వుంటాడని ఎన్ని కలలుకన్నది!

మనస్సులో ఆలోచనలు పొంగుకొచ్చినాయి. నా ఆశలు భగ్నమైతే పోనీ, వాడు సుఖపడితే చాలుగదా! నేను ఇన్నిసంవత్సరాలూ వాడి సుఖంకోసం కదూ పడిన యాతన అంతా. పసుపుకుంకుమ పోయిన తరువాత, వాడి ఒక్కడిముఖంచూచి గుండె ఎంత నిబ్బరంచేసుకున్నాను! నా ఆశలూ, వాడి సుఖమూ అన్నీ గంగలో గలిపాడు. అమ్మని వదిలే వాడు కాడే "అమ్మ, అమ్మ" అంటూ పలవరించేవాడు, ఇప్పు డింత నిర్లక్ష్యం చూపి వెళ్ళిపోయాడు! అమ్మమీద ఆపేక్ష తగ్గిందా? లక్ష్మీదేవి గారికి ఆలోచనలూ ఇంకా బరువెక్కినాయి.

వెనక ఒకసారి తన తమ్ముడు ఆదిశేషయ్యగారి ఇంట్లోనించి ప్రసాదం దెబ్బలాడి వచ్చేసినరోజుమాట! తండ్రిపోయాక, కొన్నాళ్లు మావద్ద వుండనిమ్మని, మేనల్లుణ్ణి తీసుకెళ్ళారు, ఆదిశేషయ్యగారు. అక్కడ అడ్డమైన చాకిరీ చేయించారు, అష్టకష్టాలు పెట్టారు. జరిగిన వన్నీ అమ్మకి తెలియనివ్వలేదు ప్రసాదం. అసలే స్వయంపాకం, మిత భాషిన్నీ. మేనమామకూతురు దుర్గ చాలా ఎగతాళి చేసేది. ఒకసారి వాళ్ళ ఇరుగింటి ఇల్లాలు మేనత్తతో "మేనల్లుడికి, మీ అమ్మాయినిచ్చి పెళ్ళిచేసి ఇల్లరికం పెడతారా? చాలా బాగుంటుందమ్మా. మీకూ ఒక్కతే సంతాయిరి" అంటే "ఆఁ! అందగా అందగా ఈ దిక్కుమాలిన సంబంధమే అందాలా? వీళ్ళనాన్న మా మామగారి నోరుకొట్టి మా ఆస్తంతా కట్నాలూ, కానుకలూ అందేదుగదా. ఏం కట్టుకుపోయాడేం? మా నెత్తిని వీళ్ళనిబడేసి మరీ వెళ్లాడు" అంది ఈసడింపుగా. ప్రసాదం విన్నాడు. తరువాత ఒకనాడు "పొలంలోకి వెళ్ళిరావాలిరా" అన్నారు శేషయ్యగారు. "అల్లాగే మామయ్యా. ఆకలేస్తూంది, భోంచేసి వెళ

తాను" అన్నాడు ప్రసాదం. "ఒళ్లు కరగనివ్వవేమిరా?" అన్నారాయన. "భోజనానికి ఏమీ లోటులేదు" అంది ఆవిడ. ఇల్లా దినగండంగా అల్పపు మాటలతో కాలం వెళ్ళబుచ్చుతూ వచ్చాడు ప్రసాదం. ఒకనాడు తాను భోంచేస్తూ, పైగరుకి ఒక ముద్దకలిపి తన కంచం ప్రక్కగా పెట్టాడు. మేనత్తగారు చూచి తోకతొక్కిన త్రాచులా చరచర దగ్గిర కొచ్చింది. "ఏమిట్రా ఇది. తలదూర కంతలేదు–మెడకొక డోలు అని, ఈ కుక్క ఒకటా, పైగా, దండగ!" అని కసిరింది. ప్రసాదానికి కడుపు దేవినట్టయింది, కళ్ళనిండా నీళ్లు క్రమ్మినయి. వెంటనే కంచందగ్గర నించి లేచాడు. "మళ్ళీ నాజన్మలో మీగడపత్రొక్కనులేమ్మా" అన్నాడు. గంపెడు ఆకలితో సరసరా తన ఇంటికి బయలుదేరాడు. పైగరుకి ఏదీ సరిగ్గా అర్ధంకాలేదు. అయినా, తినేముద్ద వదిలి, చెవులు ఆడించుకుంటూ, కూడా వచ్చేసింది.

మండుటెండలు, దారిలో నీడైనా లేదు, ఒక్కొక్కచోట మంచి నీళ్ళులేవు దాహానికి. కాళ్లు బొబ్బలెక్కేటట్టూ తిండీతీర్థాలు లేకుండా నడిచాడు. సగందూరం వచ్చేటప్పటికి ప్రక్క పల్లెటూరులో చెరువులో నల్లకలువలున్నాయని గుర్తొచ్చింది. అమ్మకి నల్లకలువలు ఎంతో ఇష్టం. బాలకృష్ణుడు ఇదే నీలంరంగులో వుండేవాడేమో అనికూడా అంటూ వుండేది. అవిచూస్తే అమ్మమనస్సు ఎంత పొంగుతుందో!" దారి పెడ ద్రొక్కాడు. చెరువులోఈది పువ్వులుకోసి కలువఆకులోపెట్టి పైతువ్వా లులో మూటకట్టి అమ్మకి తెచ్చిఇచ్చాడు. ఆ కొడుకేనా వీడు? ఈనాడు అమ్మని వదిలి వెళ్ళిపోయాడే!

లక్ష్మీదేవిగారు లేచి బయటకొచ్చారు. ప్రొద్దు బాగా వాటాలి పోతూంది. ఆకాశంమీద నల్లని మబ్బు పట్టింది. మబ్బుక్రిందగా

ఓప్రక్కన నీటిపక్షులు, నిమ్మళంగా, గుంపుగా, చక్రాకారంగా ఎగురుతున్నాయి. ఇంకోప్రక్కన ఇంకా క్రిందిగా, తూరీగలు గుంపులు గుంపులుగా ఎగురుతూ ఆడుతున్నాయి. "పైగర్, పైగర్" అని గట్టిగాపిల్చింది. ఉహూఁ! ఎక్కడా కనుచూపుమేర పైగరు లేదు. వాడు చాలా విసురుగా వెళ్ళిపోయాడు. పైగరు ఎప్పటిలా వాడికూడానే వెళ్ళిపోయి ఉంటుంది.

లక్ష్మీదేవిగారికి కడుపులో ఏమో తిరిగినట్టయింది. మానసికబాధ భౌతికంగాకూడా ఉన్నట్టనిపించింది. వీధి అరుగుమీద కూలబడ్డది. దుఃఖము పొర్లుకొచ్చింది. చిన్నతనంలో వాడుచేసిన చేష్టలన్నీ జ్ఞాపకమొచ్చాయి.

ఒకసారి తండ్రిపోయిన క్రొత్తరోజుల్లో అది—మేనమామగారి ఇంట్లోనించి కొడుకూ, తల్లీ తిరిగివస్తున్నారు. వాళ్ళ ఇంటికి ఆదిశేషయ్యగారి గేదదూడకి జబ్బుచేసింది. బ్రతకని జబ్బే. బ్రతకదని అందరూ నిశ్చయించారు కూడాను. ప్రాణం పోకముందే, వాళ్ళ చెప్పులు కుట్టే వెంకణ్ణిపిల్చి తీసికెళ్ళిపొమ్మన్నారు దూడని. "దూడ ఇంకా కొన వూపిరితో ఉందయ్యా" అన్నాడు ప్రసాదం కోపం దిగమ్రింగుతూ. "ఉంటే ఏం? ఆ ప్రాణం వాడిదగ్గరయినా పోతుందిగా" అన్నా డాయన నిర్లక్ష్యంగా. ఇంకా డొక్కలెగురవేస్తున్న దూడని కదిపి తీసుకెళ్తూంటే ప్రసాదం నిలవలేకపోయాడు. తల్లిని ప్రయాణంకట్టించాడు స్వగృహానికి. కాని ఈ జరిగినదంతా లక్ష్మీదేవిగారికి తెలియనివ్వలేదు కొడుకు—తెలిస్తే ఆ జాలిగుండె బాధపడుతుందని. అసలు ఆమాటకొస్తే, తన తమ్ముడు ఏమన్నా అన్నా లక్ష్మీదేవిగారు వెంటనే మరిచిపోయేవారు. ఆవిడ స్వభావం అది. ఇంతకీ వీళ్లు బయలుదేరేటప్పుడు ఎవ్వరూ వెంట రానూ లేదు. కనీసం వాళ్ళ పాలేరునైనాకూడా పంపలేదు. కాలినడకనే పోదా

మన్నాడు ప్రసాదం. ఏమిటో కీచులాట జరిగిందిగదా మామగారితో. అందుకని ఆవిడ సరే అంది. అప్పటికి ప్రసాదం చిన్నవాడు. ఊరు దగ్గరగా వచ్చేటప్పటికి పాలకోడు దాటవలసివచ్చింది. అది పంటకాలువ. ఒక జానెడులోతుకూడా సరిగ్గాలేదు. నీళ్లు, నీటిక్రింద గులక రాళ్ళు, ఇసక. చిన్నపిల్లలు సహితం నీళ్ళల్లో నడిచిపోతారు – బోదె కడ్డంబడి. ఆ పిల్లకాలువదగ్గరికి రాంగానే లక్ష్మీదేవిగారికి వళ్ళంతావణికి పోయింది–భయంతో. నీటికేసి తేరిచూసి కళ్లురెండూ గట్టిగా రెండు చేతులతో మూసేసుకుంది. నీళ్ళలోమాత్రం ప్రాణంపోయినా అడుగు పెట్టనంది. ప్రసాదం గాభరాపడ్డాడు. ఒంటరిగాడు - పైగా చిన్నతనం. తల్లి భయంచూచి జాలిపడ్డాడు. "ఏమిటమ్మా" అన్నాడు. "అమ్మో ఎంతలోతువుందో చూడరా. మునిగిపోతాం. నీలంగా ఎంతలోతో-భయంగా వుందిరా" అంది. ప్రసాదం చూచాడు. పైనఉన్న అనంతఆకాశం, మబ్బులతోసహా ఆ జానెడులోతు నీళ్ళలోనూ అగాధంగా ప్రతిబింబిస్తోంది. ప్రసాదానికి నవ్వాలో ఏడవాలో తెలియలేదు. కాని అమ్మని దాటించాలి గదా! ఇదివరకెన్నడూలేని బాధ్యతవచ్చింది. ధైర్యంచేసుకుని అమ్మ చెయ్యిపట్టుకుని నీళ్ళల్లోనించి నడిపించాడు. కాలువదాటినతరువాత ఆవిడ కళ్లు తెరిచింది. ప్రసాదం "అమ్మా" అన్నాడు గొంతు వణుకుతూ. "ఇక నేనులేకుండా, ఎప్పుడూ ఇల్లుబయలుదేరకు" అన్నాడు బాధ్యతాయుక్తంగా.

అటువంటి చిన్నితండ్రికి ఈవేళ ఇంతకోపం ఎట్లావచ్చిందో తల్లి కర్థంకాలేదు. మేనమామవిషయం తప్పేముంది? అసలు మేనమామ మాట ఎప్పుడెత్తినా పసివాడికి కోపమేగదా! ఆమాటకొస్తే కారణాలు లేకపోనూలేదు. ఒక్కొక్కటే లక్ష్మీదేవిగారికి జ్ఞాపకంవచ్చాయి. వాళ్ళనాన్నగారు పోయిన సరిక్రొత్తరోజుల్లో పుట్టింటికిరమ్మని ఆదిశేషయ్యగారు

పాలేరుతో కబురుపెట్టారు - లాంఛనంగా. వాళ్ళ యింటికి వెళ్ళిన తరువాత, వాళ్లు ఎక్కి-వెళ్లిన ఒంటెద్దుబండి బాడుగకూడా వాళ్ళివ్వలేదు. అప్పుడు లక్ష్మీదేవిగారు కొడుకు లాగుజేబులో పాతడబ్బాలోవున్న కొత్త కానులూ, అణాలూ తీసి లెక్క-పెట్టి బండివాడి కిచ్చింది. వాళ్ళనాన్న బ్రతికివున్న రోజుల్లో తనదగ్గర ఎప్పుడు క్రొత్తకాని దొరికినా కొడుకు కిచ్చేవాడు-ముద్దుగా. అవ్వన్నీ ఒక డబ్బాలోపెట్టి దాచుకున్నాడు. ప్రసాదం అప్పటికి చిన్నవాడేమొ అవికాస్తా తీసుకునేటప్పటికి బావురని ఏడ్చేశాడు.

బయట గాలిహెచ్చింది. మబ్బులు కొంచం దట్టమవుతున్నాయి.

లక్ష్మీదేవిగారు ఆదుర్దాగా బయలుదేరి, గ్రామంలో నాలుగువీధులూ పిచ్చిపట్టినట్టూ వెతికివచ్చింది. తనబిడ్డ కనిపించలేదు. మళ్ళీ వీధిఅరుగు మీదనే కూర్చొబడిపోయింది.

అప్రయత్నంగా కొడుకు బాల్యం జ్ఞాపకం వస్తోంది- వాడిచదువు సంధ్యలు, ఆటపాటలు ఆనాడు-రాఘవరావుగారి లోగిలి గుమ్మంలో దసరా పాటలు పాడినరోజు! పంతులుగారు భద్రయ్యగారి ప్రక్క-నే నించుని వున్నారు. లక్ష్మీదేవిగారు దేవుడిగుళ్లోనించి ఆదారినే వస్తూంది. బడిపిల్లలందరూ పాటలాపేశారు. అదికూడా గమనించకుండా "కొడుకులు కోదండ్రుడు కొమరొప్పగానూ...." అంటూ దీర్ఘంతీస్తున్నాడు ప్రసాదం. ఎవ్వరూ గొంతుకూడా కలపకపోయేప్పటికి అతను తలవంచుకుని సిగ్గుగా నవ్వాడు. ఎదురుగా అరుగుమీద బల్లపడకకుర్చీమీద కూచున్న వృద్ధుడు రాఘవరావుగారుకూడా బోసినవ్వు నవ్వారు. లక్ష్మీదేవిగారు అక్క-డే కొడుకును కావిలించుకుని, తల నిమిరి "సిగ్గుపడకురా నాయనా! అమ్మను నేనున్నానుగదా" అని ధైర్యంచెప్పి ముద్దులాడదా మనుకుంది. అప్పుడే ఇంట్లోనించి బయటికొస్తున్న రాఘవరావుగారి కొడుకు ఆమెవేపు చూసి "మీ అబ్బాయా అమ్మా?" అన్నాడు. అతను బయటకురాగానే అరుగుల

క్రింద కూచునివున్న బిళ్లబంట్రోతులు లేచి వినయంగా నిలబడ్డారు. ఏదో సభకి అధ్యక్షతవహించమని అడగడానికి బయటవూరునించి వచ్చిన పెద్ద మనుష్యులు వంగి నమస్కరించారు ఆయనకి. ఆయన కాలేజీలో పెద్ద చదువులు చదివి గొప్ప సర్కారుఉద్యోగి అయ్యాడు. పండుగకి స్వగృహానికి సపరివారంగా వచ్చాడు. పంతులుగారితో మాట్లాడాడు. లక్ష్మీదేవిగారి కుటుంబవిషయంగా, ఆమె భర్తగారి రాచకీయ ప్రయత్నాలూ, ఆస్తి వ్యయం వగైరా.

ఆనాడుపుట్టింది ఆవిడకి ఆ కోర్కె. తన ఒక్కకొడుకుకూడా అంతటి విద్యావంతు డవ్వాలి. అంతగొప్ప ఉద్యోగి అయి, ఇంతటిహోదా వాడుకూడా అనుభవించాలి. విద్యావంతుడై, అందరి మానమన్ననలకూ పాత్రుడవ్వాలి. అదిఒక్కటే ఆశ. తనజీవితంలో అంతకుమించిన కోర్కె లేదు వేరే. ఏది ఎల్లాగైనాసరే వాడికి విద్య చెప్పించితీరాలి. భగవంతుడిదేభారం. "తెలివైనవాడండీ కుర్రాడు, వృద్ధిలోకివస్తాడమ్మా" అన్నారు భద్రయ్యగారు. ఆవిడతోనూ, రాఘవరావుగారి కొడుకుతోనూ. "మీ ఆశీర్వాదం నాయనా" అంది లక్ష్మీదేవి.

ఆ ఆశలవల్లనేగదా అల్లాంటి ఏర్పాట్లు చేసింది. లేకపోతే ఏమయిపోను! ఇప్పుడు అన్నీ సఫలమయ్యాక, ఈ విధంగా విడిచి వెళ్ళిపోడం ఏమిటి? వాళ్ళ మామమాట తను ఎత్తకుండావున్నా బాగుండేదేమో. కాని ఎల్లా ఆ ప్రస్తావనే లేకుండా వుండడం? ఊఁ! బాగా ఆలోచిస్తే శేషయ్య మాత్రం ఏమంత శ్రేష్టుడు. ధనాశపరుడే. వివరాలు మనస్సులో మెదిలాయి—కొన్ని. ఆ పడమటి ఆవునిగురించి తను చేసిందేమిటి? ఆవుని మేపమని లక్ష్మీదేవిగార్కి పంపారు—శేషయ్యగారు, వీళ్ళ ఇంటి కొచ్చాక చక్కని నందిలాంటి కోడెదూడ పుట్టింది, ఆవుకి. దూడకి 8 మాసాల వయస్సు వచ్చేటప్పటికి రాఘవరావుగారు పోయారు.

ఆయన పేరుతో ఆబోతుగా అచ్చు వెయ్యడానికి రాఘవరావుగారి ఇంట్లో వాళ్ళు ఈ కోడెదూడని కొన్నారు. వాళ్ళు కొన్నప్పుడు దూడ ఇంకా పాలైనా వదలలేదు. లక్ష్మీదేవిగారు ఆవునీ దూడనీ వేరు చెయ్యనంది. అందువల్ల అచ్చువేసి దూడని తిరిగి వీళ్ళ ఇంట్లోనే కట్టేసారు. పాలు సొంతంవదిలిన తరువాతగాని, దూడని తిరిగి పంపలేదావిడ. ప్రస్తుతం తన కొడుక్కీ తనకీ ఈ ఎడబాటు ఎవరు చేసారో! ఆ మాటకి గుండె తల్లడిల్లింది.

అన్నట్టూ, మేనమామ ఆవుమాట ఏమయింది? సరి. రెండో సారి ఆవు చూడితో వుండగా "శేషూ, పిల్లవాడు చిక్కిపోతున్నాడు. పాలూ పెరుగూ వాడికి అవసరం వస్తాయి. ఏదో ఒక ధరకట్టి ఆవుని నావద్దనే వుంచండిరా. తోలికెళ్ళవద్దు" అంది లక్ష్మీదేవిగారు. అందు కాయన "మొదటి దూడని 250 రూపాయలకు అమ్మాముగదా. ఇప్పుడు చూడితోవుందిగదా, కడుపులోవున్న దూడకి 250 రూపాయలు ఆవుకి 400 అంతా 650 రూపాయలు ధర కట్టాడు.

పైగా ఆ రెండోసారి పుట్టిన కోడెదూడకి ప్రక్క టెముకలలో ఒకటి తక్కువ. ఇంటికి క్షయం అన్నారు తెలిసినవాళ్లు. ఒక బీద బండి వాడు విధిలేక కొనుక్కున్నాడు, ఆ దూడని. ఆవుకూడా ఆ తరువాత నల్ల కప్పువేసి క్షీణించుకొచ్చింది.

అటువంటివాడు ఆదిశేయ్యగారు. ఎంతవరకూ తన ఆయుష్య తన ఆరోగ్యమే. మేనమామ ఎటువంటివాడయినా తానేంచేసింది? తనమీద ఎందుకీకోపం? ఒక్కడే ఒక్క కొడుకు వైధవ్యంలో వార్ధక్యం సమీపిస్తుండగా ఇల్లా ఒంటరిగా వదిలి వెళ్ళడం ఎవరు భరిస్తారు! ఎంత ఆపుకున్నా లక్ష్మీదేవిగారికి దుఃఖం ఆగలేదు.

లేచి వీధిలోకివచ్చి వెర్రిగా చూసింది. "భగవంతుడా, చేతిలో ఊతకి ఒక కర్ర ఇచ్చావు. తిరిగి లాక్కున్నావా?" అంది ఏడుస్తూ. చేతులు జోడించి పైకి ఆకాశంకేసి చూసింది—భక్తితో. ఆ చూపులో వెయ్యి పూజలున్నాయి.

బయటగాలి పెద్దదయింది. గాలిలో ఉధృతం వేగం హెచ్చినాయి· చినుకులు అరంభమైనాయి.

కన్న కొడుకు. లేకలేక దేవుడికి మ్రొక్కులు మ్రొక్కి కనిన బిడ్డ—ఏమైపోతున్నాడో! దుఃఖంతోనే ఇంట్లోకి వెళ్ళింది. గాలి విసురికి తలుపులన్నీ కొట్టుకుంటున్నాయి. కాని తలుపులు మూయబుద్ది కాలేదు. తన బిడ్డ ఎక్కడో తడుస్తున్నాడు, తనకెందుకు భద్రత.

కిటికీలోంచి అతని మేజామీదికి జల్లు కొడుతూంది. అతని కాలేజీ పుస్తకాలన్నీ తడిసిపోతున్నాయి. వెళ్ళి ఆ కిటికీ మటుకు మూసింది.

ఎంతెంత ఆశలతో ఈ కాలేజీ చదువులు చదివించింది. ఏడవ క్లాసులో మార్కులు బాగా వచ్చాయి. భద్రయ్య పంతులుగారు "కుర్రాణ్ణి పైకి చదివించండమ్మా" అన్నారు. ఎల్లాగో స్కూలు ఫైనల్‌వరకూ గట్టెక్కించింది. ఘనతగా ప్యాసుఅయ్యాడు. "ప్రసాదం యోగ్యుడమ్మా పైకి చదివించాలి" అన్నాడు భద్రయ్యగారు పట్టలేని తృప్తితో — లక్ష్మీదేవిగారి ఇంటికొచ్చి. లక్ష్మీదేవిగారి హృదయం పొంగిపోయింది. కాని మరుక్షణం "డబ్బు" అంది. "మా జరుగుబాటు మీకు తెలుసుగదా?" అంది తిరిగి. "బుద్ధిమంతుడమ్మా డబ్బుకి ఏదో ఏర్పాటు చెయ్యాలిమరి" అన్నారాయన లేచి వెళ్ళిపోతూ "పోనీ ఆదిశేషయ్యగారేమీ చెయలేరా?" అన్నారు తిరిగి. ఆయన మాట స్ఫురించి లక్ష్మీదేవిగారు తలా చెయ్యీ అడ్డంగా వూపారు. "అబ్బెబ్బె! అది బ్రహ్మకలండీ! వాడికీ పీడికీ

ఒకళ్ళపొడఅంటే ఒకళ్ళకి గిట్టదు—ఉప్పుకి నిప్పు. మా తమ్ముడు అండా ఆదరణా వీడు ఒప్పుకోడు గదాండి" అంది నిరాశగా. "ఆఁ, చిన్నతనపు పట్టుదలలులెండి. వాటికేంగాని, అయినా డబ్బు ఎల్లా సర్దుబాటు చేసినా వాడికి తెలియవల్సిందేముంది? ఇన్నాళ్ళూ మీరెల్లా కష్టపడిందీ ఎల్లా చదివించిందీ వాడికి తెలుసునా ఏమన్నానా? చెపితే వాడికేమి అర్థమవు తాయి? పసివాడు. అయినా ఈ ఆలోచనలన్నీ వాడికి పెట్టకండి. వాడు వృద్ధిలోకివస్తే సంతోషిస్తాను. డబ్బు విషయం ఏదో ఏర్పాటు చేద్దాం చేసితీరాలి" అని వెళ్ళిపోయారు పంతులుగారు.

ఆ సంవత్సరం విశ్వవిద్యాలయం ఉన్న పట్టణంలో కళాశాలలో చేరాడు—ప్రసాదం. హాస్టలులో సీటు దొరకలేదు-లక్ష్మీదేవిగారు కొడుకుని వదలి ఉండలేకపోయింది ఒంటరిగా. దగ్గరనేఉండి కొడుకికి అలనాపాలనా చూస్తూ స్వయంగా వంటచేసి పెడదామని బస్తీలో చిన్న కాపరం పెట్టింది, ఆవిడ.

ఆ రోజులన్నీ నిన్నటిలాగు అనిపించింది, ఆ పాత ఇంట్లో కూలబడివున్న తల్లికి.

ఆ బస్తీలో తెలిసినవాళ్లెవరూ లేరు. లక్ష్మీదేవిగారికి ఒక విధ మైన భయంకూడాను. అసలు వచ్చేటప్పుడే — గోదావరిమీదికి రైలు రాంగానే "అబ్బాయీ, గంగమ్మ గోదావరికి అప్పగారుటరా. ఆ గంగ నీళ్ళు అందుకని ఈ గోదావరి నీళ్ళకి చూపిస్తే పొంగుతాయిటరా" అంది. కాలేజీలో చదవడానికి, ఆ బండిలోనే ప్రయాణంచేస్తున్న ఆడపిల్ల ఒకతె పక్కున నవ్వింది. లక్ష్మీదేవిగారు నొచ్చుకుంది.

ఇంటికి తిరిగి వచ్చేస్తూ "భగవంతుడు నాకు ఆడపిల్లల్ని ఇవ్వ లేదురా. నా అదృష్టం. నాకు ఒక్క పిల్ల గనక ఉన్నట్టయితే మీ నాన్న దాన్ని కూడా ఇల్లాగే, కాలేజీలో చదివించేవారు ఖచ్చితంగా. దాంతో

అదీ ఇలాగే తయ్యారయ్యేదిసుమా! నాకు నువ్వు ఒక్క మొక్క చాలురా" అంది ప్రసాదరావుతో.

ప్రసాదానికి మాత్రం కాలేజీకి వచ్చినప్పటినుంచి ఆలోచనలు పెంపైనాయి. తన ఉపాధ్యాయులతో పరిచయాలు వృద్ధి చేసుకున్నాడు. అనేక పుస్తకాలు, విమర్శలూ చదువుతూ వచ్చాడు. కొన్ని నిశ్చయాభిప్రాయాలకి వచ్చాడు. కొడుకులో వచ్చిన ఈ మానసిక పరిణామము అమ్మకి తెలియదు.

ఋతువులు గడుస్తున్నాయి. ఒకనాటి సాయంత్రం "గుళ్ళో హరి కథ ఉందట, వెళ్తాను" అంది లక్ష్మీదేవిగారు. నాకూ ఏమీ తోచటంలేదు ఘైగరుని తీసుకుని నేనూ అల్లా వెళ్ళి తిరిగి వస్తాను" అన్నాడు ప్రసాదరావు.

అప్రయత్నంగా లెక్చరర్ నారాయణగారి ఇంటివేపు మళ్ళినాయి కాళ్ళు. ఆయన టెన్నిస్ ఆడుకోడానికి క్లబ్బుకి వెళ్ళారుట. చదువుకుంటూ పడక కుర్చీలో కూచునిఉన్న శ్యామల చెప్పింది. శ్యామల నారాయణగారి చెల్లెలు, ప్రసాదం సహాధ్యాయినీ. ఆ రోజు దేవుడూ, వేదాంతం విషయం తర్కం వచ్చింది. దేవుడు సర్వే సర్వత్ర ఒక్కడే అని నిశ్చయాని కొచ్చారు! శ్యామలా, ప్రసాదమున్నూ.

తిరిగి ఇంటికొచ్చేటప్పటికి లక్ష్మీదేవిగారు కూడా వచ్చేశారు. "ఒరే! ఈవేళ కథ వినడానికి గరుత్మంతుడుకూడా వచ్చి గుడిస్తంభం మీద కూచున్నాడురా. అల్లా రెక్క విదిపాడు. ఇన్ని నీళ్ళు క్రింద బడ్డాయి. స్నానంచేసి కూడా వచ్చాడల్లేవుంది. ఎంతోభక్తి అనిపించింది నాకు" అంది అమ్మ ఆశ్చర్యంగా, గడ్డంక్రింద చెయ్యి ముడుచుకుని.

వెర్రి అమ్మ అమాయకురాలు, పాపం- అనుకున్నాడు ప్రసాదం- జాలిగా "ఏం పిచ్చమ్మా! ఇంకా నీకు ఈ పిచ్చి నమ్మకాలు పోలేదు. ఆ గద్ద ఎక్కడో తడిసివచ్చి ఉంటుంది" అన్నాడు పైకి.

"దేవుడి విషయం ఇంత నిర్లక్ష్యంగా మాట్లాడతాడేమిటి?" అనుకుంది బాధగా, మనస్సులో, లక్ష్మీదేవిగారు.

ప్రసాదానికి పాఠాలు గడచినకొద్దీ శ్యామలతో పరిచయం హెచ్చవుతూ వచ్చింది. కష్టమూ సుఖమూ ఆమెతో ముచ్చటిస్తుండేవాడు. శ్యామల అర్థం చేసుకుని ఆదరణ చూపింది.

ఆ ఏడు వీళ్ళ బస్తీకాపురం ఎలాగుందో చూడ్డానికి ఆదిశేషయ్యగారు వచ్చి మకాం వేశారు. వచ్చినప్పటినుంచీ ప్రసాదాన్ని ఒక కంట కనిపెడుతూనే వున్నారు—అసలే చుక్కెదురాయె, "కాఫీలు, టీలూ జబ్బు వస్తువులు. వాట్లల్లో ఉన్న బలం అంతా పంచదారా పాలూనూ" అంటూ కాఫీలో రెట్టింపు పాలు చక్కెర కలిపించేవారు. ప్రసాదానికి ఆ కాఫీ హాలాహలంలా గనిపించేది" ఇది కాఫీయా? ఇందులో కొంచం సగ్గుబియ్యం వెయ్యక పోయావూ. పాయసమన్నా అవునుగా! ఛ, ఛ కాఫీ వాసనేలేదు. ఎల్లా త్రాగడం?" అని విసుక్కునేవాడు. ఆఖరుకి ఈ పానీయాలు త్రాగలేక హోటలుకి వెళ్ళిపోయేవాడు కాఫీలకు. అది ఏమాత్రమూ బాగుపడే లక్షణంగా కనిపించలేదు, శేషయ్యగారికి. వ్యాయామం. శరీరానికి అత్యంవసరం అని, తెల్లవారుజామున ప్రసాదాన్ని లేపేసి, దండాలూ బస్కీలు తియ్యమన్నారు. రాత్రి పొద్దుపోయే వరకూ నిద్ర లేకుండా చదివి, సాయంత్రం ఆటలాడివచ్చిన ప్రసాదానికి లేవడం కంటకంగా వుండేది. శేషయ్యగారికి ఆ బద్ధకం పనికిరాదు. ప్రసాదం కాలేజీ లెక్చరు నోట్సు అతి తీవ్రంగా తిరగేసుకుంటూంటే సృష్టి అంతా 7 అక్షరాల్లో వుందిరా. సరి గమ పదని అని సంగీతమూ, ఉపన్యాసమూ మొదలెట్టేవాడు.

7)

కాని, ఆదిశేషయ్యగారి జులుము, ప్రసాదం అంతగా పట్టించుకో లేదు—మనస్సులో.

పగలు యేదో వేళలో శ్యామల కనిపిస్తూండేది. అతన్ని చూడం గానే వెలిగిన శ్యామల ముఖం, హృదయపూర్వకంగా శ్యామల పలుక రించిన మైత్రి, గురుసన్నిధిలో అతనివేపు చూసిన పిరికిచూపులు తన స్వగృహంలో అన్నగారితోసహా అతనితో వాదించిన బుద్ధికుశలత— ఏమేమో జ్ఞాపకాలు వచ్చేవి నిద్రవేళకి. ఆ మధురస్మృతుల పరిమళాలలో తృప్తిగా నిద్రపట్టేది—ప్రసాదరావుకి.

అది కాలేజీలో మూడవసంవత్సరం. పరీక్షలూ, పాఠాలూ, క్రీడలూ, చర్చలూ వగైరా కళాశాల వాతావరణపు కార్యక్రమాలతో ప్రసాదానికి రోజులు గడుస్తున్నాయి. అతనికి విశ్వమంతా సౌందర్యమయంగా కని పించింది. తీర్చి చెప్పలేని మాధుర్యం హృదయాన్ని ఆవరించింది. తన శ్యామలని చూడనంతసేపూ మనస్సు బాధగా వుండేది. పరిచయం ప్రేమగా పరిణమించింది.

ఉద్యోగం దొరికినతరువాత అమ్మకి శ్యామల విషయం చెప్పవచ్చు. ఇప్పుడు తొందరేమిటి అనుకున్నాడు ప్రసాదం. ఐనా చెప్పినా అమ్మకి అంత సానుభూతి లేదు, చదువుకున్నపిల్లలమీద. శ్యామలని అమ్మ అర్థం చేసుకున్నతరువాత విషయం చెప్పవచ్చు. అమ్మకిమాత్రం యీ పరిస్థితు లేవీ ఛాయామాత్రంగా కూడా తెలియవు.

ఆఖరుసంవత్సరం, లేతవేసవిలో, పరీక్షలునెగ్గి, ఉద్యోగిఅయిన తరువాత వివాహ మాడతానని శ్యామలకి ప్రేమతో వాగ్దానం చేశాడు, ప్రసాదం. శ్యామల ఆ రోజుకోసం బ్రతికివుంటానంది.

ఎండలు ముదిరాయి. ఎం. ఏ. పరీక్షలుకూడా అయిపోయాయి. రోజులు గడిచినాయి. ఫలితాలు వచ్చేశాయి. ప్రసాదం ప్రథమశ్రేణిలోనే ప్యాసయ్యాడు. ఉద్యోగాన్వేషణ మొదలెట్టాడు. లాభంగాలేదు.

ఒకనాడు తల్లి ధైర్యంచేసుకుని "బాబూ! మనం వచ్చినపని అయిపోయిందిగదరా. ఇంకా యెందు కిక్కడ, అనవసరంగా మనం, వృథాగా యింటిబాడుగ యిచ్చుకుంటూ. గ్రామానికి వెళ్ళిపోదాం. అక్కణ్ణించే నీవు వుద్యోగానికి వుత్తరాలు వ్రాయవచ్చుగా" అంది.

ప్రసాదానికి భయంవేసింది. శ్యామలని వదలి దూరంగా వెళ్ళడం యెల్లా? తొందరలో వుద్యోగం వెతుక్కోవాలి. అవును. అమ్మని గ్రామంలో వదిలిపెట్టి, అవసరమైతే ముఖ్యపట్టణం వెళ్ళి పెద్దల్ని కలుసుకోవాలి. బరువుగానే "సరే" అన్నాడు.

ప్రయాణంనాడు శ్యామలకి వీడ్కోలుచెప్పాడు ఏకాంతంగా, దైవసన్నిధిలో.

తుదిసారి తనూ, శ్యామలా కలిసి చదువుకున్న కాలేజీ ఒక్కమాటు చూచిపోదామని వెళ్ళాడు. కాలేజీ ఆవరణంతా నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా వుంది—ఆ మిడి మిడి యెండలో మర్రిచెట్లలోనించి కబోది పక్షులు వ్రేళ్ళాడుతున్నాయి. లెక్చరుహాలు ఎదురుగా తెల్లగన్నేరుచెట్టు ఆకులన్నీ రాల్చి మొండిగా నించునివుంది. ఆ దిశ కొమ్మల కొనల పువ్వులు గుత్తులలోనించీ, అపుడపుడూ శబ్దంలేకుండా ఒక్కొక్క తెల్లటిపువ్వు క్రిందికి రాలిపడుతూంది—అశ్రుబిందువులా.

ప్రసాదం కాళ్ళీడ్చుకుంటూ యింటికి తిరిగివచ్చాడు. ఎండలు చల్లారినయి. నీడలు చీకటిలో కరిగిపోయేవేళకి రైలు కదిలింది.

ఆ అమాయకపు అమ్మకి యివ్వేవీ తెలియవు. గ్రామం తిరిగి వచ్చినతరువాతనించీ ప్రసాదం అదోక మోస్తరుగానే వున్నాడు. ఇంటి

వ్యవహారాలు, విపులంగా చెబుతూంటే అతను వినే ధోరణిలోవున్నట్లు గానే లేదు. లక్ష్మీదేవిగారికీ ధైర్యం రావడంలేదు. కొడుకు మౌనంచూచి "ఏమిటీ మార్పు తండ్రీ నీలో ?" కాని ఆ ప్రశ్న ఆమె నోటినించి బయటికిమాత్రం రాలేదు.

ఆఖరికి ధైర్యంచేసుకుని యీనాటి సాయంత్రంకదా, కాస్త ప్రస్తావించింది—ఇంతలో యిల్లా వద్దని వెళ్ళిపోయె. బయట వర్షం బాగానే కురుస్తోంది. కాని ఆవిడకి గాలికూడా సోకడంలేదు. అసలు యీవేళ కలహం యెల్లావచ్చిందో బలవంతంగా గుర్తుతెచ్చుకుంటోంది, లక్ష్మీదేవిగారు.

"ఉద్యోగంవిషయం నేను స్వయంగా వెళ్ళి చూచుకోవాలమ్మా. ఇక్కడేవుంటే, దొరికేటట్లుగాలేదు" అన్నాడు ప్రసాదం, మధ్యాహ్నం కాఫీ అయ్యాక—కాస్సేపటికి. "ప్రసాదం నువ్వు యిలా పాస్ అయ్యావని మీ మామయ్యకి ఏనుగనెక్కినంత సంతోషంగా వుందిరా" అంది ఆవిడ. ప్రసాదరావు పట్టించుకోలే. ఆమె తిరిగి "నువ్వింత విద్యావంతుడవయి వృద్ధిలోకి వస్తావని, వాడు...." అంటూండగా—

"ఏం ? ఎదురుచూస్తున్నాడా ఆయన ?" అన్నాడు ప్రసాదం, విసుగ్గా.

"కాదురా, కనకవర్షం కురిపించాడు" అంది. ప్రసాదం తెల్లబోయాడు. కొంచెం తేరుకొని "ఆయనడబ్బుతోనా, నాకు చదువు చెప్పించావు ? ఎంతపని చేశావమ్మా ! నేను కాలేజీలో వున్నప్పుడు క్రొత్తరోజుల్లో ఎన్నోసార్లు నిన్ను తబిసీళ్లు అడిగానుకూడాను చూచాయగా. ఫరవాలేదురా, నగలుఅమ్మేను అన్నమాటతప్ప రెండోమాట చెప్పవయితివే !" క్రొత్తస్వరంతో అన్నాడు—ఎదురుగా శూన్యంలోకి చూస్తూ.

లక్ష్మీదేవిగారికి తన ముద్దుబిడ్డ యెందుకింత బాధపడుతున్నాడో తెలియలేదు.

మరికొంచెంసేపాగి "మరి అపుడే నాతో ఎందుకు చెప్పలేదు ?" అన్నాడు. అమ్మ మౌనం.

మరి కాస్సేపాగి "దీనికి ఎంత వడ్డీ వేశాడు?"

"వడ్డీ లేదురా" అంది లక్ష్మీదేవిగారు కొంచెం తెప్పరిల్లి. "వాళ్ళ దుర్గని నీ కిచ్చి పెళ్ళిచేసే యేర్పాటుమీద" చిరునవ్వుకళ్ళతో.

"ఆఁ !" అన్నాడు ప్రసాదం వెర్రిగా, ఆశ్చర్యంగా. కొంచెం సేపటికి గొంతు పెళ్ళగించుకొని వచ్చింది "ఎవరియేర్పాటు యిది ?"

"నేనూ, మీ మామయ్యారా. లేకపోతే. ఇన్నివేలు ఎల్లా ఖర్చు పెడతాడు ? ఈ ఆశే. అందులోనూ మీ మేనత్త తెచ్చిన ఆస్తే ఎక్కువ వాళ్ళకి. ఆవిడా యీ ఆశవల్లనే, నీకోసం, వాణ్ణి యిల్లా ఖర్చుపెట్ట నిచ్చింది" అంది ఫరవాలేదుగదా అనుకుంటూ.

ప్రసాదంనోట బదులురాలేదు. ఒక విషస్వప్నంలో స్వరాలలాగు వినిపిస్తున్నాయి, కన్నతల్లి మాటలు.

"అంతా నీ మేలుకోరేగదరా !"

"ఆఁ ! నా మేలా ! ఎంత ఘోరం జరిగింది" ప్రసాదానికి తల తిరుగుతోంది.

ఆ వెర్రితల్లికి యింకా ఏమీ అర్థం కావడంలేదు. "మరి......... ముహూర్తం ఎప్పుడు పెట్టమంటావురా ?" ప్రసాదానికి స్పృహవచ్చింది.

"ఇదిగో, ఇప్పుడే !" అన్నాడు చటాలున లేచి "ఇక తిరిగిరాను" అని వెంటనే వెళ్ళిపోయాడు. అంతే.

ఇదీ జరిగిన కలహం. ఇప్పు డంతా స్ఫురణ కొస్తూంది. బయట గాలివాన మెండయింది. దక్షిణాన గోనలేరు పొంగి గట్లుతెంచుకుని వూళ్లోకి వచ్చింది. చిన్న యిండ్లవాళ్ళూ, పల్లపుయిండ్లవాళ్లు పెద్ద యిండ్లలోనూ, మేడల్లోనూ దాక్కున్నారు.

లక్ష్మీదేవిగారి యిల్లు వూగిసలాడుతోంది. రెండు తలుపులు విరిగి పడిపోయినాయి. లక్ష్మీదేవిగారు అల్లా కూర్చునే వుండిపోయింది. పొంగి పొంగి దుఃఖం వస్తోంది.

భద్రయ్యగారి కొడుకు తడిసి ముద్దయి వచ్చాడు. అతన్ని చూడం గానే యింకా భోరున ఏడ్చింది, లక్ష్మీదేవిగారు. "నా కొడుకు ఏడీ ?" అంది వెర్రిగా, బలవంతంగా వాళ్ళింటికి యీడ్చుకుపోయాడు అతను అవిడ్ని సగం స్పృహతో జీవచ్ఛవంలా. అతికష్టంమీద జరిగినదంతా చెప్పించుకోగలిగారు భద్రయ్యగారు, ఆయన కుటుంబమున్నూ. "వాడు బాగున్నాడంటారా ?" అంది దీనంగా. "అంత బొత్తుగా చిన్నవాడా అమ్మా. ఏం భయంలేదు వాడికి. మీరు నెమ్మదిగా వుండండి" అన్నారు భద్రయ్యగారు. "వర్షానికి ఎక్కడా తడిసిపోవడం లేదుగదా ?" అంది. పోతూన్న మతిని చిక్కపట్టుకుంటూ. "ఎక్కడైనా దాక్కోకుండా వుంటాడాండీ ? వాడి క్షేమం వాడికి తెలియదూ" అన్నాడు భద్రయ్యగారి కొడుకు. "చాలు బాబూ ! వాడు క్షేమంగావుంటే" అంది. క్షణికమైన కాంతి కళ్ళల్లో మెరిసింది. వెంటనే తలవంచుకుని కూచుంది, గోడని అనుకుని.

రాత్రి అంతా ఉరుములు మెరుపులతో వర్షం, నిర్విరామంగా.

లక్ష్మీదేవిగారు నిబ్బరంగా చూడ్డానికి ప్రయత్నిస్తోంది. దగ్గర నించున్న ప్రతివాళ్ళనీ "నా ప్రసాదం బాగున్నాడంటావా తడవకుండా?" అంది ఆశగా.

భద్రయ్యగారి దొడ్లో బాదంచెట్టు విరిగి, ఎగిరింది గాలిలో, చిన్న యిండ్లకప్పులు విరిగి నీళ్ళల్లో తేలిపోతున్నాయి. వీధుల్లో పల్లాల్లో నీళ్ల రొమ్ములోతు వచ్చినయి. బ్రతికున్న పశువులన్నీ యీదుకుపోతున్నాయి. భద్రయ్యగారు, ఆయన కొడుకూ బయటకు టార్చిలైట్లు వేసి చూస్తూ అటూ యిటూ తిరుగుతూ నీళ్ళల్లోంచి వచ్చేవాళ్ళని చేదుకుంటున్నారు— ధైర్యంచెబుతూ.

బయట వర్షం నిలబడి కురుస్తోంది. లక్ష్మీదేవిగారు సొమ్మసిల్లి పడిపోయింది. ఏడుపు రావడంలేదు.

సూర్యోదయానికి ముందే గాలి ఆగిపోయింది. వర్షం తగ్గింది. నీళ్ళల్లోంచికూడా మనుష్యలు యీదుకుంటూ, నడుస్తూ గాబరాగా తిరుగుతున్నారు.

తూర్పారేవేళకి భద్రయ్యగారి కొడుకు బయటనుంచి పరుగెత్తుకుంటూ వచ్చి "అమ్మా, అమ్మా" అని అరిచాడు. లక్ష్మీదేవిగారు ఖంగారుపడి లేవబోయింది, "బాబూ! వాడు బాగున్నాడటనా? ఏ వూళ్లో వున్నాడు?" అంది మతిలేకుండా, వెనక్కి కూచోబడిపోయింది వెంటనే. "అదుగో మన ప్రసాదాన్ని చూశాను. మీ రింకా మీ యింట్లోనే వున్నారనుకొని అక్కడికి వెళ్ళాడట" నిలువులోతు నీళ్ళల్లోంచి యీదుకుంటూను—వాళ్ళంతా చెబుతుంటేనే!" అన్నాడు వగరుస్తూ.

"ఆఁ! ఆఁ! ఏడీ నా తండ్రి తిరిగివచ్చాడా! అమ్మదగ్గరికి వచ్చాడా? నాకు దిక్కుందా? తడిశాడా బాబూ, చూశావా?" అంది లక్ష్మీదేవి దృష్టి అతనిమీదనే నిలపడానికి ప్రయత్నిస్తూ.

"అదిగో చూడండి, బయటికి ఆ పెద్దరోడ్డుమీద" అన్నాడు బయటికి చేతులు చూపిస్తూ గుమ్మంల్లోంచి, "అదిగో, ఆ కారు కన

బడడంలే తెల్లది ? ఆ పైని రెండు గీతలు లేవు నిలువుగా అడ్డంగా ఎర్రవి—అది—అందులో అదండీ—అదుగో. తడిసిపోయి పైగరు కూడా పరిగెట్టడంలే ? కారుకూడా. ఆ కారు, దాంటోవున్నాడు ప్రసాదం. నేను పోవాలికూడా" అన్నాడు.

గబ గబ షర్టు వేసుకుంటున్నాడు. "ఆ కారులోవున్న సర్దారు డాక్టరుని అడిగాను. మీ యింట్లోకి వెళ్ళంగానే యిల్లువిరిగి దూలం కాళ్ళ మీద పడ్డదట. కంటికికూడా యేదో తగిలినట్టుగా వుంది. కాళ్లురెండూ తీసెయ్యాల్సివస్తుంది అన్నారు డాక్టరు. ప్రాణభయంలేదు. ఆస్పత్రికి పోతోంది కారు" అని వూపిరితిరక్కుండా చెప్పి పరుగెత్తుకుపోయాడు—బయటికి.

* * *